దోచేస్తున్న దళారులు

- నాణ్యత పేరుతో ధరల్లో కోతలు
- అన్నదాతల ఆవేదన

వెంకటాచలం: ఆరుగాలం శ్రమించి పంటలను పండించిన రైతులను దళారులు దోచేస్తున్నారు. వ్యవసాయంలో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు పెరిగినా, లెక్కచేయకుండా పంటను అన్నదాతలు కాపాడుకుంటూ వచ్చారు. పండిన పంటను అమ్ముకుందామంటే సరైన ధరల్లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మిల్లర్లు, డీలర్ల కుమ్మక్కై తమను మోసం చేస్తున్నారని మండిపడుతున్నారు.

సాగు ఇలా..

వెంకటాచలం మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కాలువల ఆధారంగా గత రబీ సీజన్లో 50 వేల ఎకరాలకుపైగా వరిని సాగు చేశారు. అయితే దిగుబడులు తగ్గిపోవడం.. సరైన మద్దతు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరుండటంతో ఎడగారు సాగుకు అధికారులు అనుమతిచ్చారు. దీంతో రబీ సీజన్లో వచ్చిన నష్టాలను పూడ్చుకుందామనే ఆశతో వెంకటాచలం మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఎంటీయూ 1010, కేఎల్ఎం వరి విత్తనాలను వేశారు. తిక్కవరప్పాడు, కంటేపల్లి, అనికేపల్లి, పంజులూరుపాడు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇవి పూర్తయ్యాయి. ఎంటీయూ 1010 రకం ధాన్యం సాగు చేపట్టిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు పెరిగిపోయాయి. దుక్కి నుంచి ఇదే తరహా పరిస్థితి ఉండటంతో ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడైంది. అయితే ప్రస్తుతం ఎంటీయూ 1010 రకం ధాన్యం పుట్టి ధర రూ.15 వేలకే దళారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది పుట్టి ధర రూ.17 వేల నుంచి రూ.18 వేలకుపైగా కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా కోతలు రావడంతో మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధరలు తగ్గించేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గొలగమూడిలో వరికోతలు

నాణ్యత పేరుతో దోపిడీ

గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరుకు పచ్చిగా ఉందంటూ పుట్టి ధరలో రూ.200 నుంచి రూ.500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి నివాసాల్లో నిల్వ ఉంచుకునే వెసులుబాటు లేకపోవడంతో దళారులు అడిగిన ధరకు ధాన్యాన్ని ఇవ్వాల్సి వస్తోంది. పౌర సరఫరాల శాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలను నిర్వహించకపోవడంతో అమాయక రైతులను దళారులు మోసగిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి దళారుల దోపిడీని అడ్డుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ధాన్యం రాసులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి వ్రతం



పొదలకూరు: స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. వివిధ రకాల పూజా సామగ్రితో వ్రతాన్ని ఆచరించారు. మహిళా భక్తులు హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. వెంకటేశ్వరస్వామికి పల్లకిసేవను సాయంత్రం నిర్వహించారు.

వెంకటేశ్వరుడికి వెండి కిరీటం బహూకరణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామికి వెండి కిరీటాన్ని నెల్లూరుకు చెందిన రుద్రపాటి శ్రీనివాసులు నాయుడు శనివారం బహూకరించారు. 2.5 కిలోల బరువున్న దీని విలువ రూ.2.5 లక్షలుంటుందని దేవస్థాన నిర్వాహకులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



విగతజీవిగా పడి ఉన్న వ్యక్తి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మద్రాసు బస్టాండు ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి బులుగు రంగు టీషర్టు, బులుగు రంగు షాట్ వేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు చిన్నబజారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

చేనేత క్లస్టర్‌కు ఆర్థిక సాయం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పాటూరు గుమ్మల దిబ్బ చేనేత క్లస్టర్‌కు 86 మంది లబ్ధిదారులు చెల్లించాల్సిన సభ్యత్వ నగదును పద్మశాలి సంఘ గౌరవాధ్యక్షుడు చింతలపూడి పెంచలయ్య అందజేశారు. ఈ మేరకు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో క్లస్టర్ అధికారి ప్రసాద్‌రావు, జౌళిశాఖ అభివృద్ధి అధికారి బాలసుబ్రహ్మణ్యంకు రూ.1.26 లక్షల చెక్కును లబ్ధిదారుల తరఫున శనివారం అందించారు. దీనిపై జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ వెంకయ్య, జానపద రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఇద్దరి నేత్రదానం



చెలంచర్ల శ్రీనివాసరావు(ఫైల్)



పెంచలప్రతాప్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని సూర్యటవర్స్‌లో నివాసం ఉంటున్న చెలంచర్ల శ్రీనివాసరావు(75) శనివారం మధ్యాహ్నం ఆయన నివాసంలో మృతిచెందారు. ఇండియన్ రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ డి.రవిప్రకాష్ సహకారంతో మృతుని కుటుంబ సభ్యుడు వెంకటకల్యాణ్ చక్రవర్తి ఆయన నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుడు శ్రీనివాసరావు నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో వాసవి వనిత లెజెండ్ సంఘ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత, అభయం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు ఈవీఎస్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక సంతపేట సమీపంలోని కుక్కలగుంట దుర్గమ్మగుడి సమీపంలో నివసిస్తున్న వేలూరు పెంచలప్రతాప్(40) శుక్రవారం రాత్రి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు చెంగల్పట్టు ప్రతాప్, కంచర్లపల్లి అనిల్‌కుమార్‌ల సహకారంతో మృతుని కుటుంబ సభ్యుడు వేలూరు పెంచలనరసింహులు(మాజీ కార్పొరేటర్) పెంచలప్రతాప్ నేత్రాలను పెద్దాస్పత్రికి దానం చేశారు. దీంతో టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందించారు. టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన వారు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

దేశాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకం



ఇందుకూరుపేటలో..



కొడవలూరు: అధ్యాపకులకు సన్మానం

ఇందుకూరుపేట: దేశాభివృద్ధిలో గురువుల పాత్ర ఎంతో కీలకమని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. ఇందుకూరుపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి వారి ఉన్నతికి బాటలు వేయాలని కోరారు. అనంతరం ఎంఈఓలు ఎస్వీ నాయక్, సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గందళ్ల శంకరయ్య, జెడ్పీ ఉపాధ్యక్షురాలు శ్రీహరికోట జయలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పెంచల శ్యామ్‌ప్రసాద్, ఎస్టీఓ వీవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** గురుపూజోత్సవంలో భాగంగా నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో శనివారం అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, డైరెక్టర్ జయలక్ష్మి అధ్యాపకులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించి, మాట్లాడారు. అధ్యాపకులు విద్యార్థులకు ఆదర్శంగా ఉంటూ వారి భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, ఎన్‌సీసీ కేర్ ఆఫీసర్ సీహెచ్ సతీష్, ఏఓ కె.గిరీష్‌కుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

లెక్చరర్ మందలించాడని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మనుబోలు: లెక్చరర్ మందలించాడని మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మనుబోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగింది. కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఆసిఫ్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో లెక్చరర్ మందలించాడు. దీన్ని అవమానంగా భావించి ఆసిఫ్ ఎదురుగా హైవేపైకి పరుగెత్తి గూడూరు నుంచి నెల్లూరు వైపు వేగంగా వస్తున్న కారుకు అడ్డుగా నిల్చున్నాడు. అయితే కారు డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్వల్పంగా గాయపడిన ఆసిఫ్‌ను కళాశాల సిబ్బంది మనుబోలు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై లెక్చరర్‌ను వివరణ కోరగా ప్రవర్తన సరిగా లేకపోవడంతో సరి చేసుకోమని మందలించానని తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

సాగు భూములకు హక్కు కల్పించరూ..

మనుబోలు: కాగితాలపూరు పరిధిలో 22 ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములపై వారికి హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య కోరారు. సాగు భూములకు రీ సర్వేలో పట్టాలివ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనను శనివారం చేపట్టారు. తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాగితాలపూరు రెవెన్యూ పరిధిలోని 148, 151 - 2, 161, 165 - 1 సర్వే నంబర్లలో గల 64 ఎకరాల ప్రభుత్వ భూములను 180 పేద కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. రీసర్వేలో దీన్ని గుర్తించి సాగుదారులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. సీపీఎం నేతలు దేవదానం, ఆదిశేషయ్య, వెంకటేశ్వర్లు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

లడ్డూ @ రూ.4.03 లక్షలు

మనుబోలు: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపంలో గల విశ్వనాథ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కూచిపూడి నాట్యకారిణి కందల సుస్మిత ప్రదర్శన అలరించింది. లడ్డూను వేలం వేయగా, రూ.4.03 లక్షలకు కుడితిపల్లికి చెందిన గుండుబోయిన వెంకయ్య, వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. వినాయకుడి మెడలో వేసిన నోట్ల మాలను రూ.2.23 లక్షలకు బండేపల్లికి చెందిన మేకల యోగేశ్వరరావు, రూ.ఐదు నాణేన్ని రూ.50 వేలకు కావేటి పెంచలయ్య దక్కించుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో మండలంలో వినాయక నిమజ్జనాలు ముగిశాయి.



నెలాఖరులోగా కేబుల్ వైర్లను తొలగించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెలాఖరులోపు అనధికారంగా విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను నిర్వాహకులు తొలగించాలని, లేనిపక్షంలో విద్యుత్ సిబ్బంది తొలగించాల్సి ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని మిలీనియం, రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్లలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తంభాలపై ఉన్న కేబుల్స్ వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కీలకమన్నారు. డీఈఈలు సునీల్‌కుమార్, కిరణ్, ఏఈలు కృష్ణవేణి, విజయ్‌కుమార్, మునిశేఖర్, సురేష్, గోపాలకృష్ణ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

గొలగమూడిలో పూజలు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్ద గల భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. నిత్యాన్నదానశాలలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని హౌస్‌తోటలో రేషన్ బియ్యం తరలిస్తుండటం గమనించిన స్థానికులు శనివారం తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అధికారులు ఘటనా స్థలానికి వచ్చేలోపే రేషన్ బియ్యం తరలిస్తున్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని, బియ్యం తరలిస్తున్నట్లు తమకు సమాచారం ఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

పొదలకూరు: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై శనివారం దాడి జరిగింది. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన పెంచలస్వామిపై స్థానిక గ్యాస్ గోడౌన్ వద్ద వేణుగోపాల్‌రెడ్డి రాడ్‌తో దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి సమీపంలో పేకాట స్థావరాలపై దాడులను పోలీసులు శనివారం సాయంత్రం నిర్వహించారు. గ్రామ సమీపంలోని ప్రైవేట్ లే అవుట్ వద్ద పేకాటాడుతున్నారంటూ స్థానికులు సమాచారం అందించారు. దీంతో సీఐ సుబ్బారావు, ఎస్సై ఆంజనేయులు తమ సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1240ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

విద్యుత్ క్రీడాకారుల ఎంపిక నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజమహేంద్రవరంలో ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ సర్కిల్ హాకీ, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఉంటాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యుత్ సిబ్బంది, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఈనెల 7న ఆదివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ట్రయిల్ సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు 90308 02038, 98854 46632, 95506 44396 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు జేవీవీ జిల్లా మహాసభలు

నెల్లూరు(అర్బన్): జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలను స్థానిక అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఆ వేదిక కోశాధికారి, న్యాయవాది పోతంశెట్టి విద్యాచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుడు చొప్పా రవీంద్రబాబు, జేవీవీ రాష్ట్ర సీనియర్ నాయకుడు శంకరయ్య పాల్గొంటారన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

పొదలకూరు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. పారిశుధ్య పనులను చేపట్టి దోమల ఉధృతిని తగ్గించాలని కోరారు. అనంతరం కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రిషితా కిరణ్ మాట్లాడారు. సీజనల్ జ్వరాలొస్తున్నాయని, గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకే ప్రాంతంలో వరుసగా 10 నుంచి 15 మందికి జ్వరాలుంటే తమకు సమాచారమివ్వాలని సూచించారు. వివిధ శాఖలతో సమీక్షించారు. ఏఓ విజయశ్రీ వైస్ ఎంపీపీ సోమా అరుణ, సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

రైతుల సమస్యలపై ఉద్యమానికి సిద్ధం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

కోవూరు: కూటమి ప్రభుత్వం అన్నదాతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దీనిపై ఉద్యమానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోవూరు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని, పంటలకు సరైన ధరలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు వైఎస్సార్‌సీపీ మద్దతుగా ఉందని, వారితో కలిసి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరు వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నామని, రైతులతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతులకు సహాయం చేయకుండా కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోందని, దీనిని వైఎస్సార్‌సీపీ తేలిగ్గా వదలదన్నారు. కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మవులూరు శ్రీనివాసులురెడ్డి, కోవూరు జెడ్పీటీసీ కవరగి శ్రీలత, పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, బుచ్చి రూరల్ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, బుచ్చి నగర పంచాయతీ అధ్యక్షుడు షాహుల్, విడవలూరు మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కొడవలూరు మండలాధ్యక్షుడు చమటా శేషగిరి, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు



తోటపల్లిగూడూరు: కోడూరు తీరంలో కోలాహలం



ముత్తుకూరులో ప్రత్యేక పూజలు

తోటపల్లిగూడూరు: కోడూరు, కాటేపల్లి తీర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. గణనాథులు భారీగా తరలివస్తుండటంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. రహదారుల్లో ట్రాఫిక్ కొంత మేర స్తంభిస్తోంది. ఆయా బీచ్‌లలో బందోబస్తును స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు.

ముత్తుకూరు(పొదలకూరు): వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండలంలోని జంగాలకండ్రికలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, నెల్లూరు శివప్రసాద్, సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఉత్సవ నిర్వాహకులు వెంకటరమణయ్య, పెళ్లకూరు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..

కోవూరు: వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తురకా భాస్కర్ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై చర్చించారు. పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నాయకులు పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

వెంకటాచలం: సమగ్ర శిక్ష పథకం కింద అర్హులైన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేస్తామని అదనపు సమన్వయ కర్త వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు గానూ వైద్య శిబిరాన్ని వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు నుంచి 18 ఏళ్లలోపు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన ఉపకరణాలను అందజేస్తామని చెప్పారు. ఎంఈఓలు ప్రేమ్‌సుధీర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

అనుమతులు అతిక్రమించిన నిర్మాణాలపై చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో అనుమతులను అతిక్రమించి నిర్మిస్తున్న భవనాలను గుర్తించి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎస్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సమయంలో తప్పనిసరిగా అనుమతులు, ప్లాన్ నమూనాలు అందరికీ కనిపించేలా ప్రదర్శించేలా యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణ అనుమతుల నిబంధనలను ఉల్లంఘించిన వారికి సీఓ, పీఓ నోటీసులు జారీ చేసి చార్జ్‌షీట్ ఓపెన్ చేయించాలని సూచించారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండా భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మురళి, సతీష్, రఘునాథరావు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

➡ స్థానిక మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని సైన్స్ పార్క్ స్థలాన్ని కమిషనర్ నందన్ శనివారం పరిశీలించారు. సమీపంలోని భవన నిర్మాణాలను తనిఖీ చేసి అనుమతులను పరిశీలించారు. మినీ బైపాస్ ప్రాంతంలో ఎన్టీఆర్ పార్కును సందర్శించి వసతులు, సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం పార్కు పరిసర ప్రాంతాల్లో పాదచారుల మార్గాన్ని ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడి నుంచి స్థానిక గోమతి నగర్ ప్రాంతంలో ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. స్థానిక రామ్మూర్తి నగర్ ప్రాంతంలోని రైల్వే ట్రాక్ ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. జేమ్స్ గార్డెన్, వెంకట్రామాపురం ప్రాంతంలో జరుగుతున్న భవనాల డెమోలిషన్ పనులను తనిఖీ చేశారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో కాలువ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. ఈఈ శేషగిరిరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్